క్లుప్తంగా

విద్యార్థులకు షూస్ వితరణ



విద్యార్థులతో రజిత తదితరులు

హుస్నాబాద్: ఆరపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయురాలు, సమాజ సేవకురాలు సంధ్యావళి షూస్ వితరణ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ రజిత 63 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనా ణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు సంధ్యావళి షూస్ అందించడం సంతోషకరం అని ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, ఎంఈఓ మనీల, కౌన్సిలర్లు వేణుయాదవ్, శ్రీనివాస్, హెచ్ఎం తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పైనే కొనుగోళ్లు



రోడ్డుపై ధాన్యం రాశి

హుస్నాబాద్‌రూరల్: హన్మకొండ రోడ్డులో ప్రైవేటు వ్యాపారులు ధాన్యాన్ని రోడ్డుపై పోసి కొనుగోళ్లు చేస్తున్నారు. బహిరంగ కొనుగోళ్లను అరికట్టాల్సిన మార్కెట్ కార్యదర్శి పట్టించుకోవడం లేదని రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి ఈ కొనుగోళ్లను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రం అవసరం



వివరాలు తెలుసుకుంటున్న రమేశ్

హుస్నాబాద్: వెటర్నరీ వైద్యుడి ధ్రువీకరణ పత్రం ఉంటేనే వారపుసంతలో వ్యాపారులు పశువులను కొనగోలు చేయాలని వెటర్నరీ డాక్టర్ రమేశ్ కోరారు. పట్టణంలో జరిగే వారపుసంతను శుక్రవారం ఆయన సందర్శించారు. వ్యాపారులు ఆరోగ్యకరమైన పశువులను వధశాలకు తరలిస్తున్నారంటూ బీఎస్పీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేశ్ సంతలో పశువుల విక్రయాల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయే పశువులను కొనుగోలు చేయాలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. డాక్టర్ సర్టిఫికెట్ లేకుండా పశువులను తరలిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రవీందర్ గౌడ్, శంకర్, రాజు, సుధాకర్ ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రత్యేక తరగతులు, పరీక్షల నిర్వహణ తీరును తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని చెప్పారు. ప్రిన్సిపాళ్లు దేవస్వామి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ చాలా ముఖ్యం



పూజలు చేస్తున్న మాధవానంద స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి ఒక్కరు భక్తితోపాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని రాంపూర్ కోటి లింగాల పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మండల పరిధిలోని ఆరెపల్లి శివారులో వెలసిన సదానంద ఆశ్రమ 41వ వార్షికోత్సవంలో శుక్రవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం, వస్త్రదానం చేయడం ఎంతో ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో వైదిక నిర్వాహకులు విఠాల రాజపున్నయ్య శర్మ, చంద్ర శేఖర శర్మ, రమేశ్‌శర్మ, ఆశ్రమ శిష్య బృందం సభ్యులు చంద్రమౌళి, భిక్షపతి, మల్లయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లతో ఇక్కట్లు

జనావాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్ల యజమానులు కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, పొదలు పెరిగి, పాములు, విష పురుగులకు నిలయాలుగా మారాయి. దానికి తోడు మున్సిపల్ అధికారుల స్పందన కూడా కరువైంది.

- పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలు
- శుభ్రం చేసుకోని యజమానులు
- పాముల సంచారంతో ప్రజలు బెంబేలు
- చర్యలు తీసుకోవాలంటూ వేడుకోలు



శ్రీనగర్ కాలనీలోని ఖాళీ ప్లాట్లల్లో పిచ్చి మొక్కలు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక శ్రీనగర్ కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విషసర్పాలు, దోమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. వాటి యాజమానులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

నిర్లక్ష్యం..

చేర్యాల మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలు ఆయా కాలనీవాసులకు సమస్యగా మారాయి. ఈ ప్లాట్ల యజమానులు ఎవరూ ఈ సమస్యపై స్పందించిన దాఖలాలు లేవని, అధికారులు కూడా ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

12 వార్డుల్లోను ఇదే సమస్య

ఖాళీ ప్లాట్ల యజమానులు తరుచు తమ స్థలాలను శుభ్రం చేయాల్సి ఉంటుంది. కాని వారు అలా చేయకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోతున్నాయి. ఇక వర్షాకాలంలో వరదనీరు ప్లాట్లల్లోకి చేరి, మురుగు నీటిగా మారి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. పట్టపగలే విషసర్పాలు సంచరిస్తూ ఇళ్లలోకి వచ్చిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

నిర్లక్ష్యంగా వ్యవహరించే యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయాలి. అప్పుడు కూడా స్పందించని వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాని మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

యజమానులకు నోటీసులు ఇస్తాం



ఇబ్బందులున్న చోట సంబంధిత ఖాళీ ప్లాట్ల యజమానుల వివరాలను మున్సిపాలిటీకి అందించాలి. అలాంటి వారికి ప్లాట్లను శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇస్తాం. అయినా వారు స్పందించకుంటే జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేందర్, మున్సిపల్ కమిషనర్, చేర్యాల

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

- ఏడీఏ పద్మ



సాగుపై సూచనలు చేస్తున్న ఏడీఏ పద్మ

చిన్నకోదూరు(సిద్దిపేట)/దుబ్బాకటౌన్/దౌల్తాబాద్(దుబ్బాక): రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏడీఏ పద్మ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రకాల అంతర పంటలు సాగుచేసి మూడింతల ఆదాయం పొందవచ్చన్నారు. ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు. రాయపోల్ మండలం రాంసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై మండల వ్యవసాయ అధికారి నరేశ్ రైతులకు అవగాహన కల్పించారు. 2025 జూన్ నాటికి నంగునూరు మండలంలో ఫ్యాక్టరీ అందుబాటులోకి రానున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండలం దొమ్మాటలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఏఓ సాయికిరణ్ పాల్గొన్నారు. ఉద్యానశాఖ అధికారి రమేశ్ మాట్లాడుతూ పామాయిల్ పంటకు చీడ పీడల బెడద ఉండదన్నారు. ఏఈఓ సంతోష్, క్షేత్ర స్థాయి అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యులపై కేసు

దుబ్బాక: అనుమతి లేకుండా మందులు విక్రయిస్తున్న తొగుటలోని ఇద్దరు ఆర్ఎంపీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వినయ్ సుష్మి తెలిపారు. తొగుటలో ఆర్ఎంపీలుగా పనిచేస్తున్న దార ప్రకాశ్, చిప్ప రామచంద్రం తమ క్లినిక్‌లో ఏలాంటి అనుమతులు లేకుండా చికిత్స చేస్తూ మందులు ఇస్తున్నారని, దీంతో వారి క్లీనిక్‌లపై దాడిచేసి మందులను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.12,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని గురువారం గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థినులకు ఇంటర్వ్యూలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీకళాశాల పూర్వవిద్యార్థులకు శుక్రవారం కాగ్నిజెంట్ సంస్థ ప్రాంగణ ఎంపిక శిబిరం నిర్వహించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ రాధారాణి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2020 నుంచి 2024 మధ్య ఉత్తీర్ణులైన 150 మందికి గాను 50 మంది ఎంపికయ్యే అవకాశముందని రాధారాణి తెలిపారు.

క్రీడాకారుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మలకంబ, బీచ్ వాలీబాల్ అండర్-14, 17 విభాగాలలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సౌందర్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25న నారాయణరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక జరుగనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ సిద్దిపేటే.. మన లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట సాధనే మన లక్ష్యమని, ప్రజల భాగస్వామ్యం ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక 41వ వార్డులో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. డ్రైనేజీల్లో చెత్త, చెదారం, మట్టి పేరుకుపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయా వార్డుల్లో ఉండే ఖాళీ స్థలాల యజమానులు తప్పనిసరిగా చెట్లను, పొదలను తొలగించి పరిసర ప్రాంతాల ప్రజలకు సహకరించాలని కోరారు. దోమల వ్యాప్తికి కట్టడికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖాళీ స్థలాల్లో అపరిశుభ్రంగా ఉంటే యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పట్టణంలోని ఆసుపత్రుల్లోని హానికర చెత్తను వేరుచేసి ధర్మ ఏజెన్సీకి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపోచమ్మసాగర్‌పై విమర్శలు సిగ్గుచేటు

- బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కేసీఆర్ ఫామ్‌హౌస్ కోసమే కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంకు ప్రాజెక్టులపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కొండపోచమ్మ సాగర్‌ను నిర్మించి శ్రీరామసాగర్, నిజాంసాగర్‌లతోపాటు ఎగువ మానేరు జలాశయాలకు, యాదాద్రి జిల్లాలకు నీటిని తరలించేవిధంగా కేసీఆర్ కృషి చేశారని చెప్పారు. తెలంగాణ రైతులకు ఈ రిజర్వాయర్ వరప్రదాయినిలా మారిందని, అది తెలియకుండా అడ్డగోలుగా విమర్శలు చేయడం తగదన్నారు. హరీశ్‌రావు అక్రమంగా రైతుల వద్ద భూములు లాక్కున్నారని నిరాధార ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ నేతలు మధు, నవాజ్‌మీరా, మెట్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించిన మిల్లు యజమాని



రైతు శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్‌లో విచ్చల విడిగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారుల తీరుపై సాక్షిలో గురువారం 'ధాన్యం దళారుల పాలు'అనే శీర్షిక వచ్చిన కథనానికి వందిల్ల పవనసుత రైస్ మిల్లు యజమాని స్పందించారు. పొట్లపల్లి గ్రామానికి చెందిన రైతు చుక్క శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి మాట్లాడి మిగతా డబ్బులు ఇస్తాను తీసుకు వెళ్లమని చెప్పినట్లు రైతు తెలిపాడు. క్వింటాలు ధాన్యానికి రూ.1,950లు ఇచ్చిన వ్యా పారి తిరిగి క్వింటాలుకు రూ.2,250లు ధర చొప్పున అదనంగా మరో రూ.4,500లు చెల్లించినట్లు చెప్పాడు. నష్టపోయిన డబ్బులు పొందినందుకు సాక్షి యాజమాన్యానికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపాడు.

దొంగతనాల నివారణకు నిఘా తప్పనిసరి

- ఏసీపీ మధు



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: దొంగతనాల నివారణకు పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది అనుమానితులు, పాత నేరస్థులపై నిఘా ఉంచాలని ఏసీపీ మధు ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. పీఎస్ పరిసర ప్రాంతాలు, సీజ్ చేసిన వాహనాలు, రికార్డులను పరిశీలించారు. పీఎస్‌లో నమోదవుతున్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా కేసులు డిస్పోజల్ చేయాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. రైతుబజార్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, ముందస్తు సమాచారం సేకరించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, ఎస్ఐలు కనకయ్యగౌడ్, కొమురయ్య, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రం, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పక్కనే చెత్తాచెదారం



రాజీవ్ రహదారి పక్కన చెత్తా చెదారం

స్వచ్ఛ సిద్దిపేటగా అవార్డులు అందుకున్న మున్సిపాలిటీలో చెత్తాచెదారం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. రంగధాంపల్లి రహదారి పక్కనే కాలనీ వాసులు చెత్తను డంపు చేస్తున్నారు. మురుగు కాలువలు కూడా చెత్తాచెదారంతో నిండి పోతున్నాయి. దోమల తీవ్రత పెరిగి ఆయా కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):

అందుబాటులో ఆరోగ్య సమాచారం

- డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్



కరదీపికను ఆవిష్కరిస్తున్న పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారం కరదీపికలో అందుబాటులో ఉంటుందని, సిబ్బందికి ఇది ఎంతో ఉపయోగకరమని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రజాఆరోగ్య కుటుంబ సంక్షేమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, వైద్యాధికారులకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందించే వివిధ ఆరోగ్య కార్యక్రమాల గురించి కరదీపిక ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యత కోసమే మహా పాదయాత్ర

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

దుబ్బాకటౌన్/సిద్దిపేటకమాన్: ఎస్సీ వర్గీకరణతో దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని, దానిని వ్యతిరేకిస్తూ దళితుల ఐక్యత కోసమే మహా పాదయాత్ర చేపట్టామని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. అక్టోబర్ 25న మొదలైన మహా పాదయాత్ర శుక్రవారం దుబ్బాకకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ వల్ల భవిష్యత్‌లో మాలలు, మాదిగలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో కాల్వ లింగం, ఆస యాదగిరి, స్వామి, బత్తుల స్వామి, కాల్వ నరేశ్, రాజశేఖర్ తదితరులున్నారు. డిసెంబర్ 1న నిర్వహించనున్న సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేడ్కర్ మాల యువజన సంఘం స్థలాలను ఎవరైనా కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. వెంకటస్వామి, అంజయ్య పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. మండలంలోని శ్రీకొండపోచమ్మ ఆలయ 23వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం ఆవవరణలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ రమేశ్ రజిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు ఉపేందర్‌రెడ్డి, హన్మంత రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, యాదవరెడ్డి, కవిత, దర్గయ్య, స్వామి, భాస్కర్, మున్సిపాల్ చైర్మన్ రాజమౌళి, ఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నల్లని ఉలువలతో సత్యసాయిబాబా చిత్రం



గజ్వేల్: సత్యసాయి బాబా జయంతి సందర్భంగా రామకోటి భక్త సమాజం నిర్వాహకుడు రామరాజు నల్ల ఉలువలతో బాబా చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు చిత్రాన్ని దర్శించుకొని ఆయనను అభినందించారు.

◆ ప్రజా సంకల్పను విజయవంతం చేయండి

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకోసం 30న చేర్యాలలో తలపెట్టిన ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలని జేఏసీ మండల కన్వీనర్ చెరుకు రమణారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వైశ్యసత్రంలో శుక్రవారం కరపత్రాన్ని జేఏసీ నాయకులతో కలసి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం చేర్యాల ప్రాంతాన్ని నాలుగు ముక్కలుగా విభజించారని మండిపడ్డారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, గౌడ సంఘం నాయకుడు విష్ణుమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రేష్మ, వంశి తదితరులు పాల్గొన్నారు. మద్దూరులో చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి జేఏసీ మండల కన్వీనర్ రామగుడు బాలరాజుతో కలిసి ప్రజాసంకల్ప దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మల్లేశం, సాయిలు, శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, ఇసాక్ పాల్గొన్నారు.

◆ అధిక సాంద్రతతో మంచి దిగుబడి

గజ్వేల్: అధిక సాంద్రత పద్ధతితో పత్తిసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవి సూచించారు. అక్కారంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చే సీజన్‌లో రైతులు ఈ విధానాన్ని అమలుచేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాధిక, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, పల్లవి, ఏడీఏ బాబునాయక్, ఏఈఓ జ్యోతి పాల్గొన్నారు.

◆ కలియ దున్నితే భూసారం

మిరుదొడ్డి(దుబ్బాక)/కోహెడరూరల్(హుస్నాబాద్): కోతల అనంతరం వరి కొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుందని, కలియదున్నితే ఎన్నో లాభాలున్నాయని మండల వ్యవసాయ అధికారి మల్లేశం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాలిస్తే దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. వరి కొయ్యలను కాలిస్తే అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని కోహెడరూరల్ ఏఈఓ శివకుమార్ అన్నారు. మండలంలోని కూరెళ్ల, పదివెద, శనిగరం గ్రామాల్లో రైతుకుల అవగాహన కల్పించారు.

◆ పేకాట స్థావరంపై దాడి

దౌల్తాబాద్(దుబ్బాక): పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు దాడిచేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గోవిందాపూర్ శివారులోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడిచేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,223లతోపాటు 13 బైకులు, 11ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ డివిజన్ కోసం వినతి

చేర్యాల(సిద్దిపేట): రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని ప్రస్తావించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పలువురు నేతలు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయనను పలువురు కలిశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం అందించారు. అశోక్, భూమయ్య, యాదగిరి, భాస్కర్‌రెడ్డి, మమత, కనకయ్య తదితరులున్నారు. అలాగే కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ను కోరారు.

◆ కులగణన సర్వే ఆన్‌లైన్ నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఎంపీడీఓ భానోతు జయరాం తెలిపారు. ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండలవ్యాప్తంగా మొత్తం 136 బ్లాక్‌లు ఉండగా ఇప్పటి వరకు 86 బ్లాక్‌ల్లో సర్వే పూర్తయిందన్నారు. ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పెండింగ్ బిల్లుల కోసం వినతి

సిద్దిపేటరూరల్: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్, మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా ఖజానాశాఖ అధికారి చందునాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్ శర్మ, సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ పల్లెల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

సిద్దిపేటరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇర్కోడ్ శివారులోని లావణ్య గార్డెన్‌లో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. లక్ష్మి, రాములు, అంజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ క్రీడలతో మంచి భవిష్యత్

కొండపాక(గజ్వేల్): చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి హైస్కూల్ విద్యార్థులు బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా శుక్రవారం రవానా ఖర్చుల కోసం రూ.3వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, పీఈటీ క్యాతం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ రైతులు సహకరించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కింద నిర్మించనున్న డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ అనంతరెడ్డి కోరారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం భూసేకరణ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలువల వల్ల సాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. నీటిపారుదలశాఖ డీఈ కరుణశ్రీ, ఎంపీడీఓ జయరాం, ఆర్ఐ యాదగిరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.